ప్రజాశక్తి
సోమవారం 9 డిసెంబర్ 2024

## ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతం

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో ఆదివారం ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో జాతీయ ఉపకార వేతన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 1375 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా వారిలో 1340 మంది పరీక్షకు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతి నాయుడు తెలిపారు. 35 మంది విద్యార్థులు హాజరుకాలేదని తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన ప్రాథమిక కీని సోమవారం కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ప్రాథమిక కీపై అభ్యంతరాలను ఈ నెల 16వ తేది సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయ వెబ్‌సైట్‌లోని గ్రీవెన్స్ లింకు ద్వారా ఆన్‌లైన్‌లో స్వీకరిస్తామని ఆయన పేర్కొన్నారు.

# అభివృద్ధి, సమస్యలపై చర్చిస్తారా?

**పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన తర్వాత మొదటిసారి జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశం సోమవారం జరగనుంది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి జిల్లాకు చెందిన ఎంపి, ఎమ్మెల్యేలు, అన్ని శాఖల అధికారులు హాజరుకానున్నారు. 2022 ఏప్రిల్‌లో మన్యం జిల్లా ఏర్పాటైంది. దాదాపు మూడేళ్లు కావస్తున్నా జిల్లాలో అభివృద్ధి, సమస్యల పరిష్కారం అంతంత మాత్రంగానే ఉన్నాయి. సాలూరు, పార్వతీపురం, కురుపాం, పాలకొండ నియోజకవర్గాలతో ఏర్పడిన చిన్న జిల్లా అయినప్పటికీ తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్న ప్రాంతంగా ఉంది. మన్యం జిల్లా ఏర్పడకముందున్న దీర్ఘకాలిక సమస్యలు.. ఏర్పడిన తర్వాత కూడా వెంటాడుతున్నాయి.**

పంట పొలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు (ఫైల్)

- జిల్లాను వెంటాడుతున్న ఏనుగుల బెడద
- ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలు
- కార్యరూపం దాల్చని ఎఎన్‌ఎంల నియామకం
- నష్టపోయిన పత్తి రైతులు
- నేడు డిఆర్‌సి సమావేశం
- హాజరుకానున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-పార్వతీపురం

ఏజెన్సీ ప్రాంతంలో ఏనుగుల బెడద ఈ ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో ఏనుగుల సంచారంతో ప్రాణం, ఆస్తి నష్టం పెరుగుతోంది. జిల్లాలో ఇంతవరకు 12 మంది ఏనుగుల దాడుల్లో మృత్యువాత పడ్డారు. భారీగా పంటనష్టం వాటిల్లింది. ఒడిశా నుంచి వచ్చిన ఏనుగులు జిల్లాను వీడకుండా తిష్టవేస్తున్నాయి. వాటిని ఒడిశా వైపు తరలించేందుకు అటవీశాఖ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నా ఏనుగులు మాత్రం కదలడం లేదు. వాటికి అవసరమైన ఆహారం, నీరు పుష్కలంగా ఏజెన్సీ ప్రాంతాల్లో దొరుకుతుండడంతో అవి తిరుగుముఖం పట్టడానికి ఇష్టపడడం లేదని అధికారులు చెబుతున్నారు. ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను రప్పిస్తామని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చెప్పారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు కావస్తోంది. కానీ ఇంతవరకు ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించలేదు. మరో వైపు ఏనుగులతో సహజీవనం తప్పదనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. వీటి కోసం ప్రత్యేకంగా ఎలిఫెంట్ జోన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉంది. ప్రతిపాదనలు పంపించడమే తప్ప ఈ సమస్యకు పరిష్కారం కనుచూపు మేరలో కనిపించడం లేదు.

**ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంల నియామకమేదీ?**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిజన సంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణి ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంల నియామకానికి సంబంధించిన ఫైలుపై తొలి సంతకం చేశారు. కానీ అది ఇంతవరకూ కార్యరూపం దాల్చలేదు. ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలకు కత్తిమీద సాములా తయారైంది. ఎఎన్‌ఎంలను నియమించాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే దారిలో పయనిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎఎన్‌ఎంల నియామకం చేపట్టక పోవడంతో జిల్లాలో విద్యార్థుల మరణాలు పెరుగుతున్నాయి. ఇంతవరకు జిల్లాలో పదుల సంఖ్యలోనే విద్యార్థులు మృతి చెందారు.

**నష్టపోయిన పత్తి రైతులు**

జిల్లాలో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధర అందని ద్రాక్షలా ఉంది. రెండు జిల్లాలకు ఒకే పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో రైతులు గత్యంతరం లేక ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. విజయనగరం జిల్లా రామభద్రపురం మండలంలోని ముచ్చర్లవలస వద్ద ఉన్న ప్రతు జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. దగ్గరలో ఉన్న రైతులు కొద్దిమంది మాత్రమే కొనుగోలు కేంద్రానికి పత్తి తరలించారు. దాదాపు 80 శాతం మంది రైతులు ప్రయివేటు వ్యాపారులకు విక్రయించారు. క్వింటాకు వెయ్యి రూపాయల వరకు పత్తి రైతులు నష్టపోతున్నారు.

మన్యం జిల్లాలో 14,800 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. రెండు లేదా మూడు చోట్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే, రైతులకు సౌకర్యవంతంగా ఉండేది. బామిని, రాజాంలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని మార్కెటింగ్ అధికారులు చెప్పారు. మూడు రోజుల క్రితం విజయనగరం జిల్లా పరిధిలోని రాజాంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కానీ, మన్యం జిల్లాలోని భామినిలో ఇంకా కార్యరూపం దాల్చలేదు. దీంతో ఒక్కో రైతు రూ.20 వేల నుంచి 50 వేల వరకు నష్టపోయారు.

**గురుకుల పాఠశాలల్లో పడకేసిన విద్యాబోధన**

రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో, కళాశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు సమ్మెలో ఉన్నారు. డిఎస్‌సి నుంచి మినహాయించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. 20 రోజులుగా వారు సమ్మె చేస్తుండడంతో పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యాబోధన పడకేసింది. వారి డిమాండ్లపై ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుండటంతో గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆందోళన తీవ్రతరం చేసేందుకు సిద్ధమవుతున్నారు. వీటిపై సోమవారం జరిగే జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో చర్చిస్తారో, లేదో వేచి చూడాల్సి ఉంది.

### డిఆర్‌సి సమావేశ వేదిక మార్పు

జిల్లా అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశాన్ని తొలుత ఐటిడిఎ ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో ఉన్న గిరిమిత్ర సమావేశ మందిరంలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు సమాచారాన్ని అందజేశారు. అయితే ఆదివారం సమావేశం నిర్వహించే వేదికని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి మార్పు చేశారు. ఐటిడిఎ కార్యాలయం వద్ద గత 19 రోజులుగా గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు నిరసన దీక్షలు చేపడుతున్నారు. తమ ఉద్యోగాలను డిఎస్‌సి నుంచి మినహాయించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐటిడిఎ ఆవరణలో ఉన్న గిరిమిత్ర సమావేశ మందిరంలో డిఆర్‌సి సమావేశం నిర్వహించడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయేమోనని జిల్లా అధికారులు భావించినట్లు తెలుస్తోంది. 19 రోజులుగా సమ్మె చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు నిరసన వ్యక్తం చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సమావేశ వేదికను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి మార్పు చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను గిరిమిత్ర సమావేశ మందిరానికి మార్చారు.

పొలాల్లో కోసి ఉంచిన వరిచేను

### ఆకాశంలో మబ్బులు..

## అన్నదాతల్లో గుబులు

ప్రజాశక్తి-వీరఘట్టం

హిందూ మహా సముద్రంలో అల్పపీడనమంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు, అందుకు తగ్గట్టే ఆకాశంలో అకస్మాత్తుగా మబ్బులు ఏర్పడటంతో అన్నదాత గుండెల్లో గుబులు రేపుతోంది. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఉన్నప్పటికీ అనంతరం ఒక్కసారిగా నల్లని మబ్బులు ఏర్పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరి కోతలు పూర్తయి పంటంతా పొలాల్లో, కళ్లాల్లో ఉంది. కొన్నిచోట్ల ఇంకా పంటకోత దశలో ఉంది. కొద్దిరోజుల కిందట తుపాను ప్రభావం కారణంగా అక్కడక్కడ పంట నష్టం వాటిల్లింది. వాటి నుంచి గట్టెక్కక ముందే మరోసారి వాతావరణంలో మార్పు రావడంతో ఏం చేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలో ఉన్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ముందస్తు జాగ్రత్తగా వరిచేను, ధాన్యంపై టార్పాలిన్లు కప్పిన రైతులు

## మంత్రి పర్యటనతో ప్రయోజనమేమిటి?

ప్రజాశక్తి-సీతానగరం

**సిపిఎం**

పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా పర్యటనతో రైతులకు ప్రయోజనమేమీ లేదని సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ధాన్యం సమస్యలపై ఎక్కడా మంత్రి మాట్లాడలేదని చెప్పారు. రెడ్డివానివలస, లచ్చయ్యపేట, అంటిపేట, రామవరం గ్రామాలకు చెందిన రైతుల వద్ద పది రోజుల నుంచి ధాన్యం నిల్వలు ఉన్నాయని తెలిపారు. రైతు సేవా కేంద్రాలకు రైతులు వెళితే, వేచి ఉండాలని చెబుతున్నారని వెల్లడించారు. మంత్రి మాత్రం రైతుల ధాన్యం ఎక్కడా నిల్వ లేకుండా కొనుగోలు చేస్తున్నామని, 48 గంటల్లో అకౌంట్లో డబ్బులు జమ చేస్తున్నామని ప్రకటించారని గుర్తుచేశారు. మంత్రి మాటలు తప్ప చేతల్లో అమలు కావడం లేదని చెప్పారు. తక్షణమే రైతుల వద్దనున్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్‌చేశారు.



గుమ్మలక్ష్మీపురం లో అంబేద్కర్ విగ్రహానికి వినతిస్తున్న అవుట్ సోర్సింగ్ టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

## ఉద్యోగ భద్రత కల్పించాలి

**మహనీయుల విగ్రహాలకు గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల వినతులు**

ప్రజాశక్తి-సాలూరు

డిఎస్‌సి నుంచి మినహాయించి, ఉద్యోగ భద్రత కల్పించాలని 19 రోజులుగా సమ్మె చేస్తున్న గిరిజన గురుకులాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు.. పోరాటాన్ని ఉధృతం చేశారు. అందులో భాగంగా ఆదివారం పలుచోట్ల మహనీయుల విగ్రహాలకు వినతులు అందజేశారు. సాలూరు పట్టణంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. వీరి పోరాటానికి పలు ప్రజాసంఘాలు, పార్టీలు మద్దతు పలికాయి

**కురుపాం :** కురుపాంలోని గాంధీనగర్ జంక్షన్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు వినతి పత్రం అందించారు. వీరికి గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్, సిఆర్‌టి యూనియన్ నాయకులు రాజగోపాల్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు ఉమారాణి, జ్యోతి, కాంచన, యోహానా పాల్గొన్నారు.

**గుమ్మలక్ష్మీపురం :** గుమ్మలక్ష్మీపురంలోని అంబేద్కర్ విగ్రహానికి ప్రజా, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యాన గిరిజన గురుకుల అవట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు వినతి అందించారు. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని ప్రజా, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రకటించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు పత్తిక శంకర్రావు, ప్రధాన కార్యదర్శి పత్తిక ప్రసాదరావు, గౌరవ అధ్యక్షులు కె.భాస్కర్ రావు, ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం నాయకులు పాలక దేవానంద్, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**కొమరాడ :** కొమరాడలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు జ్యోతి, తదితరులు పాల్గొన్నారు. వీరికి ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు.



కొమరాడలో అల్లూరి, కురుపాంలో అంబేద్కర్ విగ్రహాలకు వినతులిస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

### గిరిమిత్రలో నేడు గ్రీవెన్స్

**పార్వతీపురం :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను గిరిమిత్ర సమావేశ మందిరంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా సమీక్ష సమావేశం (డిఆర్‌సి) జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తుండటంతో గ్రీవెన్స్‌ను గిరిమిత్రకు మార్చినట్లు వివరించారు. ప్రజలు దీనిని గమనించి తమ సమస్యలపై వినతులను గిరిమిత్ర సమావేశం మందిరంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్ద అందజేయాలని కోరారు.

# గిరిపుత్రుల గొంతుకై.. అక్రమాలకు అడ్డుకట్టై

***గిరిపుత్రుల గొంతైంది. అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేసే ఆయుధమైంది. పోడు భూముల పంపిణీకై పోరుదారి పట్టింది. ఈ క్రమంలో గిరిజన గూడేల్లోనూ, గుండెల్లోనూ ఎర్రజెండా అయ్యింది. ఆ ఎర్రజెండా అండతో మన్యం వాసులు ఎన్నో సమస్యలు పరిష్కరించుకుంటూ, దోపిడీ వ్యవస్థ నుంచి బయటపడుతూ ఇప్పుడిప్పుడే అన్నిరంగాల్లో పురోగాభివృద్ధి సాధిస్తున్నారు. అయినప్పటికీ ఇంకా ఎన్నో సమస్యలు, మరెన్నో ఆటంకాలు, అవాంతరాలు జిల్లా అభివృద్ధికి, గిరిజనుల ఆర్థికాభివృద్ధికి సవాలుగా మారాయి. వీటన్నింటినీ తొలగించుకుని మరో అడుగు ముందుకు వేసేందుకు గిరిజన ప్రాంతవాసులు సిపిఎం నాయకత్వంలో సమాయత్తమవుతున్నారు. ఇదీ పార్వతీపురం మన్యం జిల్లాలో సిపిఎం ప్రత్యేకత. ఈ క్రమంలో ఈనెల 10, 11తేదీల్లో కురుపాం వేదికగా జరగనున్న సిపిఎం 10వ జిల్లా మహాసభలకు ప్రాధాన్యత సంతరించుకుంది.***

- ప్రజా పోరాటాలే అజెండాగా ముందుకు సాగుతున్న సిపిఎం
- బోడి, బడిదేవర కొండల తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు
- సవర భాషా వాలంటీర్లను కొనసాగించాలని ఆందోళనలు
- పూర్ణపాడు - లాబేసు వంతెన కోసం 15 ఏళ్లుగా పోరాటం
- విద్య, వైద్యం, రహదారి సదుపాయాల కోసం ప్రభుత్వంపై నిరంతర ఒత్తిడి
- రేపటి నుంచి రెండు రోజులపాటు సిపిఎం 10వ జిల్లా మహాసభ

కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన గిరిజనులు (ఫైల్)

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

సిపిఎం గడిచిన మూడేళ్లలో ప్రజా పోరాటాలే అజెండాగా ముందుకు సాగింది. గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఇందుకోసం ఉన్న జిసిసిని బలోపేతం చేయాలని నిరంతరాయంగా పోరాడుతోంది. ఏళ్ల తరబడి గిరిజనులు సాగుచేస్తున్న పోడు భూములపై సాగు హక్కు కల్పించాలని పెద్ద ఎత్తున పోరాడి విజయం సాధించింది. మరోవైపు జిల్లాలోని బోడి, బడిదేవర కొండల తవ్వకాల అక్రమ అనుమతులకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు చేపట్టింది. మాతృ భాషలో చదువు నేర్చుకునేందుకు వీలుగా ఆదివాసీల బడుల్లో సవర భాషా వాలంటీర్లను కొనసాగించాలని ఆందోళనలు చేపట్టింది. 15ఏళ్ల క్రితం చేపట్టిన పూర్ణపాడు - లాబేసు వంతెన నిర్మించాలంటూ నాటి నుంచీ చేస్తున్న ఆందోళన గడిచిన మూడేళ్ల కాలంలో మరింత ఉధృతం చేసింది. విద్య, వైద్యం, రహదారి సదుపాయాల కోసం ప్రభుత్వాలపై నిరంతర ఒత్తిడి చేశారు. ముఖ్యంగా గిరిజన గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని నినదించింది. ఏజెన్సీలో పంటలను ధ్వంసం చేయడంతోపాటు ప్రాణహాని తలపెట్టిన ఏనుగులను తరలించాలని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతునే ఉంది. కురుపాం మండలం నీలకంఠాపురంలలో గిరిజనులకు అందుబాటులో ఉన్న బ్యాంకు ఎత్తివేతకు వ్యతిరేకంగా సిపిఎం పోరాడింది. దీంతో, బ్యాంకును యథాతథంగా ఉంచేందుకు యాజమాన్యం హామీ ఇచ్చింది.

**సవర భాషా వాలంటీర్ల కొనసాగింపుకోసం**

సవర భాషా వాలంటీర్లను సాగించాలని పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ కేంద్రాల్లో ఎపి గిరిజన సంఘంతో కలిసి సుదీర్ఘకాలం పోరాడింది. మాతృభాషలో బోధన చేస్తేనే ఎవరికైనా విద్య సులువుగా అబ్బుతుందన్న గిరిజనులు, గిరిజన సంఘాల వాదనను సిపిఎం ఏకీభవిస్తూ ముందుకు సాగుతోంది. బోయ, వాల్మీకి రిజర్వేషన్ల జీవో నెంబర్ 25ను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ గిరిజను ఐక్యచేసింది.

**పూర్ణపాడు - లాబేసు వంతెన కోసం**

కురుపాం నియోజకవర్గంలో కొమరాడ మండలంలోని 9 పంచాయతీల పరిధిలోని 22 గ్రామాల్లో సుమారు 30 వేల గిరిజన ప్రజానీకం సౌకర్యార్థం నాగావళి నదిపై పూర్ణపాడు -లాబేసు వంతెనె నిర్మించాలని 2004లో అప్పటి సిపిఎం నాగూరు ఎమ్మెల్యే చొరవ చూపిన సంగతి తెలిసిందే. దీంతో, నిధులు మంజూరు చేసినప్పటికీ, దాన్ని పూర్తిచేసేందుకు పాలక పార్టీలు చొరవ చూపలేదు. ఈనేపథ్యం నాటి నుంచి నేటి వరకు సిపిఎం పోరాడుతునే ఉంది. ఆగస్టు 15 నుండి 28 వరకు రిలే నిరాహార దీక్షలు కూడా ఆ పార్టీ చేపట్టింది. అంతరాష్ట్ర హైవేను దిగ్బంధించి నందుకు నాయకులను అరెస్టు చేసిన పాలకులు వంతెన పూర్తి చేసేందుకు మాత్రం చొరవ చూపలేదు. దీంతో, ఈ పోరాటం ఇంకా కొనసాగుతోంది.

**బడిదేవరకొండ గ్రానైట్ తవ్వకాల రద్దుకు ఆందోళన**

రైతులు, వివిధ వృత్తిదారులు, పశువుల పెంపకం దారుల జీవనంపై తీవ్ర ప్రభావం చూపే బడిదేవర కొండ గ్రానైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా సిపిఎం పెద్ద ఎత్తున పోరాడింది. ఈ ఏడాది ఆగస్టు 27, 28 తేదీల్లో ఆ చుట్టుపక్కల 26 గ్రామాల్లో ప్రచార సభలు, సమావేశాలు నిర్వహించారు. బైకు యాత్ర కూడా సాగింది. ప్రజలు కూడా గ్రానైట్ తవ్వకాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. చినగుడబలో ఆత్యం మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ త్వకాలకు వ్యతిరేకంగా సిపిఎం పోరాడింది.

**పెల్లుబికిన భూ పోరాటాలు**

పెత్తందారులు ఆక్రమించుకున్న భూములను తిరిగి పేదలకు అప్పగించాలని గడిచిన మూడేళ్లలో సిపిఎం ఆధ్వర్యాన పెద్దఎత్తున భూ పోరాటాలు జరిగాయి. సాలూరు, పార్వతీపురం గ్రామీణ మండలాలు, కొమరాడ మండలంలో గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన భూ సమస్యలపై నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా పాచిపెంట మండలం కుడుమూరులో 700 ఎకరాల భూములను సాగులోవున్న పేదలు, గిరిజనులకు పంచాలని చాలా కాలంగావున్న డిమాండ్‌తో గడిచిన మూడేళ్లు కూడా సిపిఎం ఉద్యమించింది. తూరుమామిడిలో పేదల నిర్మాణాన్ని పెత్తందారులు అడ్డుకోగా, పేదలకు సిపిఎం అండగా నిలబడింది. భూ సమస్యపై పోరాడిన శివ్వాం దళితులపై పెత్తందార్లు చేసిన దాడికి వ్యతిరేకంగా పార్టీ రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు ఆ గ్రామాన్ని సందర్శించి బాధితులకు అండగా నిలబడ్డారు. జియ్యమ్మవలస మండలంలో దళితలు, గిరిజనులపై పెత్తందారుల దాడులకు నిరసనగా కార్యక్రమాలు చేపట్టారు.ఇలా గిరిజన ప్రాంతంలో ప్రతి సమస్యపై సిపిఎం పోరాటం చేసింది.

### మహాసభకు సిద్ధమవుతున్న కురుపాం

ప్రజాశక్తి - కురుపాం

సిపిఎం పదో జిల్లా మహాసభకు కురుపాం సిద్ధమవుతోంది. మహాసభ, బహిరంగ సభ వేదికలకు సిపిఎం నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ర్యాలీ, సభా జరిగే ప్రాంగణాన్ని ఆదివారం సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుపాంలో 10, 11న జరిగే జిల్లా మహాసభకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.తులసీదాస్, కె.సుబ్బరావమ్మ హాజరవుతారని తెలిపారు. కురుపాం పాత బస్టాండ్ నుంచి రావాడ జంక్షన్ వద్ద జరిగే సభ వేదిక వద్దకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా నలుమూలల నుండి సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండల కార్యదర్శులు కోలక అవినాష్, ఎం.శ్రీనివాస్, గిరిజన సంఘం నాయకులు, యువత అనిల్, ఇండియా, రాజు, సింహాచలం, రమేష్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి వరి వంగడాలు పంపిణీ చేస్తున్న మేనేజర్

## దేశీయ వరి వంగడాలు పంపిణీ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని లక్కగూడ గ్రామంలో పెదపెంకి గోపీనాథం పొలంలో వేసిన 14 రకాల అతి విలువైన, ప్రాచీనమైన వరి వంగడాల విత్తనాలను జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనేజర్ పి.షణ్ముఖరాజు.. ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారా గ్రామాల్లో రైతులకు వరి విత్తనాల వంగడాలను పంపిణీ చేయాలనే ఉద్దేశంతో వాటిని రెండు కిలోల చొప్పున అందించారు. పోషకాలు కలిగిన వరి వంగడాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని షణ్ముఖరాజు తెలిపారు. మనిషిలో వ్యాధి నిరోధక శక్తి పెరగడానికి అవకాశం ఉంటుందన్నారు.

జలవిహార్‌లో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

## పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేటలోని ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కులో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. పార్కులో ఉన్న అందాలను ఆస్వాదించారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. జెయింట్ వీల్‌తో ఉయ్యాల్లో ఊరేగారు, స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కర్లు కొట్టారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. ఆనంద విహార్ వద్ద ఉల్లాసంగా ఉత్సాహంగా డ్యాన్సులు వేశారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న షేక్ గౌస్

## వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆదివారం వబ్బంగి పంచాయతీ పరిధిలో తొలంగూడ, జలుబుగూడ, సాకిగూడ, సంధిగూడ, తియ్యాలగూడలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉందని చెప్పారు. చలితీవ్రతతో ఇబ్బంది పడుతున్న వారిని గుర్తించి, 70 మందికి దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఆరిక ఎర్రమ్మ, సిపిఎం నాయకులు అడ్డమేశ్వర్రావు, తదితరులు పాల్గొన్నారు.

## పథకాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-వీరఘట్టం

ఎన్‌డిఎ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందించుకోవాలని టిడిపి పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ కోరారు. ఆదివారం వీరఘట్టంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 పథకం కింద కొత్తగా ఇల్లు కావాలనుకుంటే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సమావేశంలో నీటి సంఘం మాజీ అధ్యక్షులు బల్ల హరిబాబు, జామి సింహాచలం, డి.ప్రకాశరావు, తూముల రమేష్, ప్రవీణ్, డి.సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

రాజగోపాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

## రాజగోపాల్ కుటుంబానికి జోగారావు పరామర్శ

ప్రజాశక్తి-బలిజిపేట

ఇటీవల గుండెపోటుతో మరణించిన బెవర రాజగోపాల్ మాస్టారు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదివారం పరామర్శించారు. రాజగోపాల్.. వైస్ ఎంపిపి హేమలత భర్త. వంతరాంలో ఆదివారం ఏర్పాటుచేసిన రాజగోపాల్ పెద్దకర్మకు జోగారావు హాజరై, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## నేడు కడకెల్లలో రైతు సదస్సు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని నడిమికెల్ల పంచాయతీ పరిధి కడకెల్ల గ్రామంలో సోమవారం రైతు సదస్సు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని రైతుల సద్వినియోగం చేసుకొని, తమ భూ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

## అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు సన్నాహాలు

ప్రజాశక్తి-వీరఘట్టం

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

వీరఘట్టంలోని అంబేద్కర్ జంక్షన్‌లో బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు టిడిపి పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, నీటి సంఘం మాజీ అధ్యక్షులు బల్ల హరిబాబు ఆదివారం స్థలాన్ని పరిశీలించారు. మూడేళ్ల కిందట ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా జంక్షన్‌లో ఉన్న విగ్రహాన్ని తొలగించారు. ప్రస్తుతం రహదారి విస్తరణ పనులు పూర్తి కావడంతో తొలగించిన స్థానంలో అక్కడే విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రచించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు జామి సింహాచలం, డి.ప్రకాశరావు, తూముల రమేష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# ఒక వైపు ఏనుగులు... మరో వైపు కుక్కలు

### ప్రాణాలు తీస్తున్నా పట్టించుకోని పాలకులు

కుక్కల దాడిలో మృతి చెందిన మహిళ
ఇన్‌సెట్‌లో పార్వతి (ఫైల్)

**ఒకవైపు అడవి ఏనుగుల సంచారం ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంటే, మరోవైపు వీధి కుక్కలు బెడద ఎక్కువైంది. అడవి మృగాల దాడిలో మరణించారనే వార్త వినే వాళ్లం. కానీ, ఇటీవల కాలంలో కుక్కల దాడిలో ప్రజలు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. జంతువుల్లోకెల్లా అత్యంత విశ్వాసమైనది కుక్క అంటాం. అటువంటి కుక్కలే గ్రామాల్లో తిరుగుతూ యమపాసాలుగా మారుతున్నాయి. గత 18 ఏళ్లుగా అడవి ఏనుగుల దాడిలో మన్యం జిల్లాలో 17 మంది ప్రాణాలు కోల్పోతే, ఆరు నెలల కాలంలో జియమ్మవలస మండలంలో వీధి కుక్కల దాడిలో నలుగురు ప్రాణాలు విడిచారు. గ్రామాల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఒంటరిగా వెళ్లారంటే వీధి కుక్కలు వెంటపడి మరీ దాడి చేస్తున్నాయి.**

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మ వలస మండలంలో కుక్కల దాడిలో ఈ ఏడాది మే 13న వెంకటరాజపురం గ్రామానికి చెందిన బంటు లక్ష్మి, మే 27న బిత్రపాడు గ్రామానికి చెందిన శంకర్రావుపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. ఈ రెండు సంఘటనలను ప్రజలు మరువకముందే వెంకటరాజపురంలో కుండెన పారమ్మపై దాడి చేసి ప్రాణాలు తీశాయి. గ్రామాల్లో కుక్కల గుంపును చూస్తేనే ప్రజలు హడలిపోతున్నారు. గ్రామంలో కుక్కలు సంచరిస్తున్నా అధికారులు నియంత్రణ చర్యలు తీసుకోవడం లేదని పలువురు మండిపడుతున్నారు. భవిష్యత్తులో మరెంతమందో కుక్క కాటుకు బలైపోతారని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కుక్కల బెడదతో వీధుల్లోకి వెళ్లాలంటే భయపడాల్సి వస్తుందని, ఎక్కడికి వెళ్లినా ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వీడని ఏనుగుల బెడద**

గ్రామంలో సంచరిస్తున్న కుక్కల గుంపు

జియ్యమ్మవలస, కొమరాడ మండలాల్లో అడవి ఏనుగుల బెడద వెంటాడుతుంది. ఆరుగాలం కష్టపడి రైతులు పండించే వరి, మొక్కజొన్న, చెరకు పంటలను నాశనం చేస్తూ తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. గత ఐదు రోజులుగా పరజపాడు, కుదమ గ్రామాల్లో ఏనుగులు కళ్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యాన్ని ధ్వంసం చేశాయి. నదీ పరివాహక ప్రాంతాలకు, పంట పొలాలకు వెళ్తున్న వారిపై ఏనుగులు దాడి చేస్తూ ప్రాణాలు తీస్తున్నాయి. ఒకవైపు పంటలకు నష్టం, మరోవైపు ప్రాణాలు కోల్పోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పాలకులు, ప్రభుత్వాలు మారినా అడవి ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించడంలో విఫలమయ్యారు.

**పరిష్కారం చూపాలి**

మన్యం జిల్లాలో ముఖ్యంగా కురుపాం నియోజకవర్గంలో అడవి ఏనుగులు, కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించాలి. ఒకవైపు అడవి ఏనుగులు, మరోవైపు కుక్కల సంచారంతో ప్రజలు క్షణక్షణం భయంతో కాలం గడుపుతున్నారు. భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించి రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**- కోలక అవినాష్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు**

# మహాసభను జయప్రదం చేయండి

### సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

కురుపాంలో ఈ నెల 10, 11న జరిగే సిపిఎం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు కోరారు. మండలంలో పరిధిలో ఎర్రన్న గుడి సెంటర్లో ఆదివారం జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాలకు చెందిన సిపిఎం కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని, నిరుద్యోగ సమస్య తీవ్రమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీల పేరిట ప్రజలపై భారాలను మోపడం దుర్మార్గమైన చర్యని విమర్శించారు. గత ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టిడిపి, జనసేన.. ఇప్పుడు అవే స్మార్ట్‌మీటర్లను ప్రజలకు అంటగట్టేందుకు పూనుకుంటున్నాయని దుయ్యబట్టారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు, ప్రజలకు ఎంతో ప్రయోజనకరమైన ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుంటే, ఆ ప్రయత్నాలను నిలువరించకుండా రాష్ట్ర ప్రభుత్వం బలపరచడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఇలాంటి ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా పోరాటాలు ఉధృతంగా నిర్వహించాలని, అందులో అగ్రభాగాన సిపిఎం ఉంటుందని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

అత్యంత వెనుకబడిన ప్రాంతంగా ఉన్న పార్వతీపురం మన్యం జిల్లాలో తాగు, సాగునీటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. భూ సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. వీటిపై భవిష్యత్తు పోరాట కార్యాచరణ మహాసభలో రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.గంగునాయుడు, వై.మన్మథరావు, సిపిఎం నాయకులు బివి రమణ, కూరంగి సీతారాం, కరణం రవీంద్ర, దాసరి వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

**కొమరాడ :** కురుపాంలో జరిగే సిపిఎం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. ఆదివారం మండలంలోని పెద్దశాఖలో మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి, విజయవంతం చేయాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు వెంకట్రావు, స్వామి నాయుడు, సుబ్బారావు, రామన్న పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

## జంఝావతి నిర్లక్ష్యానికి పాలకులదే పాపం

### అఖిలపక్ష సమావేశంలో వక్తల అభిప్రాయం

ప్రజాశక్తి-పార్వతీపురం

ఐదు దశాబ్దాలుగా జంఝావతి ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యానికి పాలకులదే పాపమని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోంలో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మరిశర్ల కృష్ణమూర్తి నాయుడు అధ్యక్షతన నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో వక్తలు మాట్లాడారు. ప్రస్తుతం ఒడిశాలో, కేంద్రంలో బిజెపి ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయని, ఎపిలోనూ ఆ భాగస్వామిగా ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒడిశాతో ఉన్న వివాదాన్ని పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. లేకపోతే రైతు సంఘం నాయకులు, ప్రతినిధులతో కలిసి ఒడిశా వెళ్లి అక్కడి ప్రజాప్రతినిధులకు వినతులు అందజేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వి.దాలినాయుడు, పలువురు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అదుపుతప్పితే అంతే!

ప్రజాశక్తి-వీరఘట్టం

ఈ చిత్రంలోని రహదారి మండల కేంద్రం వీరఘట్టంలోనిదే. విద్యుత్తు కార్యాలయానికి వెళ్లే ఈ రహదారి ప్రమాదకరంగా మారింది. రోడ్లు, భవనాల శాఖ అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడంతో తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ నెల ఐదో తేదిన పార్వతీపురం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లే ఐస్‌క్రీమ్ వాహనం ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఎటువంటి ప్రాణహానీ జరగకపోవడంతో అధికారులంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాక ముందే ఆర్అండ్‌బి అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ఉన్న రహదారి

జెసిబి నడుపుతున్న మంత్రి సంధ్యారాణి

## అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన

ప్రజాశక్తి-సాలూరు

సాలూరు పట్టణంలో పలు అభివృద్ధి పనులకు గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదివారం శంకుస్థాపన చేశారు. రూ.63 లక్షల వ్యయంతో అఫిషియల్ కాలనీ, శివాజీ సెంటర్, గొల్లవీధి, 6, 7, 8 వార్డులలో డ్రెయిన్లు, రోడ్లు పనులకు శంకుస్థాపనలు చేశారు. ఎన్నో ఏళ్ల కలగా మిగిలిన డ్రెయిన్ల పనులకు శంకుస్థాపన చేసి, ప్రారంభించడంతో మంత్రి సంధ్యారాణికి 6, 7 వార్డుల మహిళలు అభినందనలు తెలిపారు. 8వ వార్డులో స్వయంగా జెసిబి వాహనం నడిపి పనులను మంత్రి ప్రారంభించారు.

**త్వరలో పైలట్ వాటర్ స్కీమ్స్**

పట్టణంలో నీటి సరఫరా లేని వీధులలో త్వరలోనే పైలట్ వాటర్ స్కీమ్స్ ద్వారా నీటిని అందిస్తామని మంత్రి చెప్పారు. శ్యామలాంబ అమ్మవారి జాతరకు ముందుగానే పట్టణంలో అవసరమైన ప్రదేశాల్లో రోడ్లు, మరుగుదొడ్లు, మంచినీరు ఇబ్బందులు లేకుండా చేస్తామని మంత్రి తెలిపారు. సాలూరులో దేశమ్మతల్లికి ప్రజలు పసుపు కుంకుమలు సమర్పించి, అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతానికి గురైన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక కోటినగర్ లేఅవుట్లోని అక్షర పబ్లిక్ స్కూల్లో సిసి కెమెరాలు పనితీరు పరిశీలించేందుకు గురువారం వచ్చిన టెక్నీషియన్ పాలక మురళీధర్ (38) విద్యుదాఘాతానికి గురైన విషయం తెలిసిందే. కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆయన శనివారం రాత్రి పరిస్థితి విషమించి మరణించినట్లు ఎస్ఐ నారాయణరావు తెలిపారు. మురళీధర్ సోదరుడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# మన్యం సిగలో మరో మణిపూస

### అదరహో అంటున్న అడలి అందాలు • రోజురోజుకూ పెరుగుతున్న పర్యాటకులు తాకిడి

ప్రజాశక్తి-సీతంపేట

**మన్యం జిల్లాలో సీతంపేట ఏజెన్సీ ప్రాంతం ఇప్పటికే పర్యాటక హబ్‌గా రూపుదిద్దుకుంది. ఈ ప్రాంతంలో జలపాతాలు, పచ్చని పొలాలు, అడవి చాటున అందాలు ఎన్నో దాగి ఉన్నాయి. అలాంటి మన్యం సిగలో మరో 'వింత' చేరింది. అదే అడలి వ్యూ పాయింట్. ఇక్కడి నీలి మేఘాలు కమనీయం.. రమణీయం. ఇక్కడి ప్రకృతి అందాలు కళ్లను మైమరపిస్తాయి. కనివిందు చేస్తుంటాయి. ఒంపు సొంపులతో తిరిగే ఘాట్ రోడ్డు ప్రయాణం.. అదరహో అనిపిస్తుంటుంది. అందుకే ఈ ఏడాది అడలి వ్యూ పాయింట్‌కు పర్యాటకులు భారీగా క్యూ కడుతున్నారు.**

సీతంపేట నుంచి సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో అడలి వ్యూపాయింట్. ఇక్కడికి వెళ్లే మార్గంలో ఎత్తయిన కొండలు, మలుపులు తిరిగే ఘాట్ రోడ్లు, చుట్టూ పచ్చని పొలాలు దర్శనమిస్తుంటాయి. అడలికి ఘాట్ రోడ్డులో ప్రయాణిస్తుంటే ఒకవైపు పర్వత లోయలు, మరోవైపు మనకన్నా ముందుగా వెళ్లే నీలి మేఘాలు తారసపడతాయి. మేఘాలను తాక్కుతున్న కొండల్లో ప్రయాణిస్తుంటే, స్వచ్ఛమైన గాలి మన గుండెకి తాకుతుంటే శరీరంపై రోమాలు నిక్క బొడుచుకుంటాయి. ఉదయాన్నే ఏడు గంటలకు అడలి చేరితే.. ఇక పర్యాటకులకు అరకు, లంబసింగి, ఊటిలో ఉన్నట్టే. అలా ఉంటుంది అక్కడి వాతావరణం. అక్కడ నీలి మేఘాలు మనపైనే పడుతున్నట్లు అనిపిస్తుంది. మంచు వర్షం పడుతున్నట్లుగా ఉంటుంది. మేఘాలు చుట్టూ కమ్మేసి నెమ్మదిగా నడుస్తున్నట్లుగా ఉంటాయి. మరోవైపు విపరీతమైన గాలితో మన శరీరంపై పడుతుంటే అది చెప్పలేని అనుభూతి. వేరే లోకంలో ఉన్న అనుభూతి కలుగజేస్తుంది.

అడలి వ్యూ పాయింట్

అక్కడనుండి చూస్తుంటే వంశధార రిజర్వాయర్, కనుచూపుమేరలో ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీముఖలింగం ఆలయం కనిపిస్తుంటాయి.

**రూ.60 లక్షలతో అభివృద్ధి**

అడలి వ్యూ పాయింట్ కోసం ఐటిడిఎ సుమారు రూ.60 లక్షల వరకు ఖర్చు చేసింది. రాజుల కోట మాదిరిగా రాతికట్టుతో ఎత్తయిన గోడను నిర్మించారు. వ్యూ పాయింట్ కూడా అందంగా తీర్చిదిద్దారు. సాయంత్రం నాలుగు గంటలకు అడలి వ్యూ పాయింట్‌కు చేరుకొని అక్కడ అందరూ చూడటానికి, రాత్రి బస చేయడానికి టెంట్ హౌస్‌ను ఇప్పటికే ఐటిడిఎ అధికారులు ఏర్పాటు చేశారు. పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా ఫలహారాల శాల, రాత్రి స్టే చేయడానికి టెంట్ హౌస్, తాగునీరు, మరుగుదొడ్లు ఇలా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. దీంతో జిల్లా నలుమూలల నిండే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పర్యాటకులు తరలివస్తున్నారు.

పర్యాటకుల కోసం ఏర్పాటుచేసిన ఫలహార శాల